

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 10 శనివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 247 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SATURDAY OCTOBER 10 2026 | VOL:18 | ISSUE: 247 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కారం: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 9:

22A సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు ఏడు కీలక ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. తాజాగా జీఓ 59 దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పిందన్నారు. 500 చదరపు గజాలలోపు జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల రోజుల్లో పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ మేరకు కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇస్తూ.. మెమో నెం.48030 జారీ చేసినట్లు తెలిపారు.జీఓ 59 అమలులో అక్రమాలకు తావులేదని.. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. గతంలో జీఓ 59 అమలులో జరిగిన అక్రమాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్స్ కేసులను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. 22-ఎపై శరవేగంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 22-ఎకు సంబంధించిన 10-12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్‌లో ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. జీఓ118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు చెప్పారు.22-ఎలో ఉన్నా GHMC, HMDA, DTCP, మున్సిపల్ అనుమతులున్న ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తామని మంత్రి తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు పరిష్కారం చూపుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



ఎల్‌నినో ముప్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

12న మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం

వర్షాభావ ప్రాంతాల పరిస్థితులపై సమీక్ష

రైతుల ఇబ్బందులు.. తాగు, సాగునీటి అవసరాలపై చర్చ

విద్యుత్ డిమాండ్, తక్షణ సహాయక చర్యలపై దృష్టి

కరవు మండలాల ప్రకటనకు ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి

రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, అక్టోబరు 9 :

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్టోబరు 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించి, రైతులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

వ్యవసాయం, తాగునీటికి ప్రాధాన్యం

వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత, తాగునీటి సరఫరాపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అవసరమైన సహాయాన్ని అందించడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటం వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించే అవకాశం ఉంది.

17 శాతం తక్కువ వర్షపాతం

రాష్ట్రంలో సాధారణం కంటే 17

(మిగతా 2వ పేజీలో..)

SIRపై బీఆర్ఎస్ మౌనం.. బీజేపీతో లోపాయికారి ఒప్పందమంటూ మహేశ్ ఫైర్




హైదరాబాద్, అక్టోబర్ 9: బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. SIR ఆందోళనలో బీఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. సీఈసీ తప్పిదం చేస్తుంటే హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని నిలదీశారు. నిరసన కార్యక్రమం ఎందుకు చేయడం లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ-ఫార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని, కాళేశ్వరం కేసులో సీబీఐ అరెస్ట్ చేస్తుందని భయమా అని ప్రశ్నించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయని.. ఆయనకు ఇన్ని వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. SIR ప్రక్రియపై

(మిగతా 2వ పేజీలో..)

జిల్లా ఏర్పాటు అంటే సరిహద్దులు మార్చడం కాదు: హరీశ్ రావు

సిద్ధిపేట, అక్టోబర్ 9:

'సిద్ధిపేట జిల్లా పదేళ్ల ఉత్సవాలు' సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత హరీశ్ రావు, ప్రముఖ రచయిత నందిని సిద్ధారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్ధిపేట చరిత్ర, తెలంగాణ చరిత్రను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత గురించి తెలిపారు.'ఎంతో మంది విద్యార్థులు ప్రాణ త్యాగాలకు ఫలితమే మన తెలంగాణ రాష్ట్రం. ప్రొఫెసర్ జయశంకర్ వంటి వారు జీవిత కాలం తెలంగాణ కోసం తపించారు. నీకు పదవి కావాలా, తెలంగాణ కావాలా అని కేసీఆర్‌ను అడిగితే తెలంగాణ కావాలని కోరుకున్నారు కేసీఆర్. 2001లో కేసీఆర్ అన్ని పదవులు వదలి తెలంగాణ ఉద్యమ బాట పట్టారు. 2014లో ఆమరణ దీక్ష అనే చావు నోట్లో తల పెట్టి మరీ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. రాష్ట్రాన్ని సాధించి పక్కకు తప్పుకోలే. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ అభివృద్ధిని



(మిగతా 2వ పేజీలో..)

తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్.. రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

మదురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం

ధారాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ

అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో అనివార్యమైన ఉపఎన్నికలు

4 నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతల అభివర్ణన

ఈ విజయాలతో విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా ఊరట



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి

(మిగతా 2వ పేజీలో..)

అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా.. భద్రతా వలయంలో ఢిల్లీ!

సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు

57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు

పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు

(మిగతా 2వ పేజీలో..)



నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం

విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ

తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు



ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ

(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

రైతుకు గిట్టుబాటు ధర.. వ్యవసాయానికి నిజమైన భరోసా!

వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతు పండించే పంటతోనే కోట్లాది మంది ఆకలి తీరుతోంది. ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో రైతుల శ్రమకు ప్రత్యామ్నాయం లేదు. అయినప్పటికీ పంట సాగు నుంచి దిగుబడిని మార్కెట్‌కు చేర్చే వరకు రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరగడం, వాతావరణ మార్పులు, సాగునీటి కొరత, కూలీల సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం వంటి సవాళ్లు అన్నదాతను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వ్యవసాయం లాభసాటిగా మారినప్పుడే రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోగలవు.పంట పండించడం ఒక ఎత్తయితే.. దానిని సరైన ధరకు అమ్ముకోవడం మరో ఎత్తుగా మారుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, కూలీల ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. తీరా పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్లో ధరలు పడిపోతే రైతుకు మిగిలేది అప్పులే. వినియోగదారులు మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నప్పటికీ.. అదే ఉత్పత్తికి రైతుకు తక్కువ ధర లభించే పరిస్థితి అనేక సందర్భాల్లో కనిపిస్తోంది. ఉత్పత్తిదారుడికి, వినియోగదారుడికి మధ్య ఉన్న సరఫరా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాల్సిన అవసరాన్ని ఇది తెలియజేస్తోంది.

మద్దతు ధరపై స్పష్టమైన విధానం అవసరం

రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించడం ముఖ్యమైన చర్య. అయితే ధర ప్రకటించినంత మాత్రాన రైతుకు ఆ ధర అందినట్లు కాదు. పంట కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండాలి. కొనుగోళ్లు సకాలంలో ప్రారంభం కావాలి. తేమ శాతం, నాణ్యత వంటి ప్రమాణాల పేరుతో రైతులకు అనవసర ఇబ్బందులు కలగకుండా పారదర్శక విధానం ఉండాలి. కొనుగోలు చేసిన పంటకు డబ్బులు ఆలస్యం కాకుండా చెల్లించాలి. మద్దతు ధరపై రైతులకు ముందుగానే స్పష్టమైన సమాచారం అందాలి. ఏ పంటకు ఎంత ధర లభిస్తుంది? కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయి? పంట విక్రయానికి ఏ పత్రాలు అవసరం? చెల్లింపులు ఎప్పటిలోగా జరుగుతాయి? వంటి వివరాలు సులభంగా తెలుసుకునే అవకాశం ఉండాలి. ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ బలంగా ఉంటే రైతులు గత్యంతరం లేక తక్కువ ధరలకు పంటను విక్రయించే పరిస్థితి తగ్గుతుంది. పెట్టుబడి ఖర్చులకు కళ్లెం వేయాలి వ్యవసాయంలో దిగుబడి పెరగడం మాత్రమే రైతు ఆదాయం పెరిగినట్లు కాదు. పంట సాగుకు ఎంత ఖర్చు పెట్టారు? దిగుబడి ఎంత వచ్చింది? చివరకు ఎంత ఆదాయం మిగిలింది? అన్నది కూడా ముఖ్యమే. పెట్టుబడి వ్యయాలు నిరంతరం పెరుగుతుంటే అధిక దిగుబడి సాధించినా రైతుకు ఆశించిన లాభం దక్కకపోవచ్చు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరసమైన ధరలకు అందుబాటులో ఉండాలి. కల్తీ విత్తనాలు, నకిలీ పురుగుమందుల వల్ల నష్టపోయే రైతులకు తగిన న్యాయం జరగాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక సూచనలు అందించాలి. అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాలి.

పంటల వైవిధ్యమే భవిష్యత్తుకు రక్షణ

ఒకే పంటపై ఆధారపడటం రైతులకు ప్రమాదకరంగా మారవచ్చు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా, మార్కెట్లో ధర పడిపోయినా రైతు ఆదాయం దెబ్బతింటుంది. అందుకే నేల స్వభావం, నీటి లభ్యత, స్థానిక వాతావరణం, మార్కెట్ డిమాండ్‌ను బట్టి పంటల ఎంపికపై రైతులకు మార్గదర్శకత్వం అవసరం.పంట మార్పిడి, అంతర పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగుపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి. అయితే పంట మార్పిడిని రైతులపై బలవంతంగా రుద్దకూడదు. ప్రత్యామ్నాయ పంటలకు కొనుగోలు సదుపాయాలు, నిల్వ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, మార్కెట్ అనుసంధానం కల్పించినప్పుడే రైతులు వాటివైపు విశ్వాసంతో అడుగులు వేస్తారు.

నీటి నిర్వహణకు ప్రాధాన్యం

వ్యవసాయానికి నీరు అత్యంత కీలకం. వర్షాలపై పూర్తిగా ఆధారపడే ప్రాంతాల్లో వర్షాభావం రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మరోవైపు నీటి లభ్యత ఉన్నచోట కూడా కొన్నిసార్లు అనవసర వినియోగం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. చెరువులు, కుంటలు, కాలువల నిర్వహణను బలోపేతం చేయడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడం అవసరం నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించాలి. నీటి నిర్వహణపై రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో పారదర్శకత ఉండాలి. చివరి ఆయకట్టు రైతుకు కూడా నీరు చేరేలా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలి.నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలు పెరగాలిదిగుబడి వచ్చిన వెంటనే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతుల బేరసారాల శక్తిని తగ్గిస్తోంది. నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల ధరలు తక్కువగా ఉన్న సమయంలోనూ పంటను విక్రయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు, శీతల గిడ్డంగులు, శాస్త్రీయ నిల్వ కేంద్రాలు పెంచాలి. పండ్లు, కూరగాయలు వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తులకు కోల్డ్ చైన్ సదుపాయాలు అవసరం. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా రైతులు సమష్టిగా పంటను విక్రయించే అవకాశం ఉంటుంది. డిజిటల్ మార్కెట్లను వినియోగించడంలోనూ రైతులకు శిక్షణ ఇవ్వాలి. మధ్యవర్తుల పాత్రను పూర్తిగా తొలగించడమే లక్ష్యం కాకుండా.. రైతుకు న్యాయమైన వాటా దక్కేలా మార్కెట్ వ్యవస్థను మెరుగుపరచడం ముఖ్యం.పంటల బీమా.. సకాలంలో పరిహారంఅకాల వర్షాలు, వరదలు, వడగండ్లు, కరువు, చీడపీడల కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంటల బీమా రైతులకు రక్షణగా నిలవాలి. బీమా పథకాలపై సరైన అవగాహన కల్పించడంతో పాటు నమోదు ప్రక్రియ సులభంగా ఉండాలి. పంట నష్టం అంచనా పారదర్శకంగా జరిగి, అర్హులైన రైతులకు పరిహారం సకాలంలో అందాలి.ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కేవలం నష్టాల లెక్కింపు ప్రకటనలకే పరిమితం కాకుండా.. రైతుకు తిరిగి సాగు ప్రారంభించేందుకు అవసరమైన సహాయం అందించాలి. రుణాలు, విత్తనాలు, సాగు సలహాలు, బీమా పరిహారం వంటి అంశాల్లో సమన్వయంతో స్పందించాలి.

వ్యవసాయాన్ని యువతకు ఆకర్షణీయంగా మార్చాలి

యువత వ్యవసాయాన్ని వదిలి ఇతర రంగాల వైపు వెళ్లడానికి ప్రధాన కారణాల్లో ఆదాయ అనిశ్చితి ఒకటి. వ్యవసాయంలో స్థిరమైన ఆదాయం, ఆధునిక సాంకేతికత, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెట్ అవకాశాలు పెరిగితే యువత కూడా ఈ రంగంలో కొత్త ప్రయోగాలు చేయగలదు.ఆహార ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, తేనెటీగల పెంపకం, సేంద్రియ ఎరువుల తయారీ, వ్యవసాయ యంత్రాల సేవలు వంటి అనుబంధ రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పంటను పండించడమే కాకుండా దానికి విలువ జోడించి మార్కెట్లో విక్రయించే అవకాశాలు కల్పిస్తే రైతు కుటుంబాల ఆదాయ వనరులు విస్తరిస్తాయి.

రైతు సంక్షేమమే వ్యవసాయ విధానానికి గీటురాయి

వ్యవసాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం. రైతు ఆదాయం పెరిగితే గ్రామాల్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. కాబట్టి రైతు సంక్షేమాన్ని కేవలం వ్యవసాయ శాఖ బాధ్యతగా చూడకూడదు. ఆర్థిక, నీటిపారుదల, మార్కెటింగ్, విద్యుత్, రవాణా, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలి. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం అనేది ఒక ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు.. ఆహార భద్రతకు, గ్రామీణ అభివృద్ధికి, దేశ ఆర్థిక స్థిరత్వానికి పునాది. రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. హామీలకే పరిమితం కాకుండా న్యాయమైన ధరలు, తక్కువ పెట్టుబడి వ్యయం, సమర్థ మార్కెటింగ్, పంట నష్టాలకు భరోసా కల్పించే విధానాలను అమలు చేయాలి. అన్నదాత బలంగా ఉంటేనే దేశ ఆహార భద్రత బలంగా ఉంటుంది.

ఎల్‌నినో ముప్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి)

శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదించారు. సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై పడుతున్న ప్రభావాన్ని అంచనా వేసి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

కేంద్ర సాయంపై రాష్ట్రం ఆశలు

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించడంతో పాటు, రాష్ట్రానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోసం విజ్ఞప్తి చేసినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో, కేంద్రం నుంచి సాయం పొందేందుకు తదుపరి చర్యలపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

సమగ్ర కార్యాచరణపై చర్చ

వర్షాభావ పరిస్థితులపై మంత్రివర్గ ఉపసంఘం రూపొందిస్తున్న కార్యాచరణ, అఖిలపక్ష సమావేశంలో వచ్చే సూచనలు, రైతు సంఘాలు మరియు వ్యవసాయ రంగ నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 12న జరిగే సమావేశంలో పరిస్థితుల తీవ్రతను బట్టి ప్రాధాన్యతా చర్యలను నిర్ణయించే అవకాశం ఉంది

SIRపై బీఆర్ఎస్ మౌనం.. బీజేపీతో లోపాయికారి ఒప్పందమంటూ మహేశ్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

దేశ వ్యాప్తంగా బీజేపీ, మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డెక్కాయన్నారు. 'సర్'లో దళితుల, మైనారిటీ, గిరిజనుల ఓట్లు తొలగిస్తున్నారని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో రోహింగ్యాల పేరుతో మమత బెనర్జీని, బిహార్‌లో ఆర్జేడీని గెలవకుండా ఆపారన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. జ్ఞానేశ్వర్ కుమార్‌ను తొలగించే వరకు నిరసన ర్యాలీలు కొనసాగుతాయని మహేశ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనుకుంటే 2009లోనే అయ్యేవారని తెలిపారు. శాశ్వతంగా అధికారంలో ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను తొలగించారని.. జ్ఞానేశ్వర్ కుమార్ లాంటి తొత్తులను సీఈసీగా పెట్టుకుందని బీజేపీపై విరుచుకుపడ్డారు.నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రకాశ్ రాజ్ మాట్లాడే దాంట్లో నిజం లేదన్నారు. ూ×= అంశంలో మొదట స్పందించింది కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. అర్హుల ఓట్లు కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ప్రకాశ్ రాజ్ అంటే గౌరవం ఉందని.. సామాజిక అంశాలపై ఆయన స్పందిస్తారని తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా ఓట్లు కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

జిల్లా ఏర్పాటు అంటే సరిహద్దులు మార్చడం కాదు: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి)

పరుగులు పెట్టించారు ఆయన. తెలంగాణ వచ్చిన నాడు 5 మెడికల్ కాలేజీలు ఉంటే, 33 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న రాష్ట్రంగా మారింది. తెలంగాణ ఏర్పడిన నాడు 2780 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే నేడు 10,000 సీట్లున్నాయి. ధాన్యం పంటలో, ఎంబీబీఎస్ సీట్లలో, డాక్టర్ల ఉత్పత్తిలో నేడు దేశంలో అగ్రస్థానంలో ఉంది. ఒకప్పుడు బెంగాల్ ఈ రోజు ఏం చేస్తుందో, రేపు దేశం అది చేస్తుంది అనే నానుడి ఉండే. ఈ రోజు తెలంగాణ ఏది ఆచరిస్తుందో రేపు దేశం అది ఆచరిస్తుంది అనేలా రాష్ట్రాలన్ని అభివృద్ధి చేశారు.పరిపాలన, అభివృద్ధి నేపథ్యంలో కేసీఆర్ జిల్లాలను విభజించారు. జిల్లా ఏర్పాటు అంటే.. బౌండరిస్ ఏర్పాటు కాదు. ప్రజలకు సత్వరసేవలు అందాలనే ఉద్దేశ్యంతోనే జిల్లాలుగా విభజించాం. జిల్లా ఏర్పాటుతో లబ్ధి పొందని కుటుంబమే లేదు. సిద్ధిపేట జిల్లా ఏర్పడక ముందు ఎలా ఉంది.. జిల్లా ఏర్పాటు తరువాత ఎలా ఉంది. రేపటి సిద్ధిపేట ఎలా ఉండబోతోంది.. అనే దృక్పథంతో పనిచేయాలి' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్.. రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

మొదటి పేజీ తరువాయి)

రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి.మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణిత సంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది.ధారాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది.ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరపున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి.ఈ విజయాలు తమ ప్రభుత్వం గత నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఉప ఎన్నికలు రెండు స్థానాలకే పరిమితమైనా, విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి.

అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా.. భద్రతా వలయంలో ఢిల్లీ!

మొదటి పేజీ తరువాయి)



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు.భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్ ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు.శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు.2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి





పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ.. నేరాల నియంత్రణపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ సమీక్ష

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశించారు. శుక్రవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ రివ్యూ సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, కోర్టు కేసుల పరిష్కారం తదితర అంశాలను ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఈ-సాక్ష్య, ఈ-సమ్మన్స్ అమలుపై ప్రత్యేక దృష్టి

కేసుల దర్యాప్తులో ఈ-సాక్ష్య విధానాన్ని నిబంధనల ప్రకారం అమలు చేయాలని ఎస్పీ సూచించారు. నేర స్థలంలో లభించే ఆధారాలు, ఫొటోలు, వీడియోలు, ఫోరెన్సిక్, సీసీటీవీ, డిజిటల్ ఆధారాలను చట్టబద్ధంగా సేకరించి భద్రపరచాలని తెలిపారు. సాక్ష్యాధారాల్లో లోపాలు లేకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, నిందితులకు శిక్షలు పడేలా పటిష్టమైన ఆధారాలను కోర్టులో సమర్పించాలని పేర్కొన్నారు.కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లు, వారెంట్ల అమలులో జాప్యం జరగకుండా చూడాలని, ఈ-సమ్మన్స్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను గుర్తించి, సంబంధిత నిందితులను కోర్టు ముందు హాజరుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ కోర్టు విచారణలను వేగవంతం చేయాలని, సాక్షులు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత

మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో పోలీసులు తక్షణమే స్పందించాలని ఎస్పీ సూచించారు. బాధితుల ఫిర్యాదులను స్వీకరించి, చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని, పోక్సో కేసుల్లో నిర్ణీత గడువులో దర్యాప్తు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు అవసరమైన రక్షణ, సహాయ సహకారాలు అందించాలని, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ షీ టీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

డిజిటల్ అరెస్ట్, ఓటీపీ, యూపీఐ, క్యూఆర్ కోడ్ మోసాలు, నకిలీ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఎఎఎవతీఎతీఅఎవ.స్వశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. బ్యాంకులు, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును నిలిపివేసేందుకు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాదకద్రవ్యాలు, ఆస్తి సంబంధిత నేరాల కట్టడికి చర్యలు

దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, వాహనాల చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎస్పీ సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా కొనసాగిస్తూ, సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను త్వరితగతిన గుర్తించాలని తెలిపారు. దొంగిలించిన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని, విద్యాసంస్థల పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సరఫరా గొలుసును గుర్తించి, ప్రధాన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రాత్రి పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టుల నిర్వహణను పటిష్టం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాం రెడ్డి, రవి, శ్రీనివాసరావుతో పాటు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి ఇండియన్ రోడ్ కాంగ్రెస్ గ్లోబల్ సమ్మిట్







3,000 మందికి పైగా ప్రతినిధుల హాజరు.. ఏర్పాట్లపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 9 (విజయ కెరటం):

హైదరాబాద్‌లోని హెచ్ఐటీఈఎక్స్ (HITEX) వేదికగా నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సదస్సును కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా ప్రారంభించనున్నారు. రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, రోడ్డు భద్రత రంగాల్లో తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశవిదేశాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, రహదారుల రంగానికి చెందిన ప్రముఖ నిపుణులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, అతిథులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మంత్రి అధికారులతో చర్చించారు. దేశవిదేశాల నుంచి వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ రాహుల్ గుప్తా, డైరెక్టర్ సురేందర్ గర్గ్, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద్ రెడ్డితో పాటు ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

నెహ్రూ గంజ్‌లో ప్లాస్టిక్ కవర్లపై దాడులు.. రూ.7 వేల జరిమానా

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు: మున్సిపల్ అధికారులు

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నెహ్రూ గంజ్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 5 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యాపారులకు రూ.5,000 జరిమానా విధించారు. అలాగే, రిలయన్స్ దుకాణం ఎదుట నిర్మాణ సామగ్రిని నిల్వ ఉంచి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు సంబంధిత యాజమాన్యానికి రూ.2,000 జరిమానా విధించారు.నిషేధిత ప్లాస్టిక్ కవర్లను విక్రయించడం, వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. దుకాణాల ఎదుట నిర్మాణ సామగ్రిని ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పర్యావరణ పరిరక్షణ, పట్టణ పరిశుభ్రత కోసం ప్రజలు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రమైన నల్గొండ నిర్మాణానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ జి. శ్రీనివాస్, వార్డు అధికారులు, పారిశుధ్య కార్మికులు, శానిటేషన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం అమలులో నల్గొండ జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు

సమాచార హక్కు చట్టం కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో రెండో స్థానం

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):



సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు నల్గొండ జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఈ అవార్డు జిల్లా అధికారులతో పాటు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పీఐఓలు), సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (ఏపీఐఓలు) సమష్టి కృషికి దక్కిన గుర్తింపు అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ అవార్డు, జ్ఞాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, సమాచార హక్కు చట్టం అమలులో భాగస్వాములైన పీఐఓలు, ఏపీఐఓల సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైందని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన కేసుల పరిష్కారంలోనూ నల్గొండ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.అధికారులు, సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేస్తే కేసుల పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపవచ్చని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

నల్గొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బైరెడ్డి హేమలత

18 మందితో నూతన పాలకవర్గం ప్రకటన.. సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా వడ్డేపల్లి శ్రీరాములు నియమితులయ్యారు. మొత్తం 18 మందితో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల ఖరారులో భాగంగా నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని ఓసీ మహిళల కేటగిరీకి కేటాయించారు. ఈ కమిటీ పదవీకాలం ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి రెండేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతుందని ప్రభుత్వం పేర్కొంది. నూతన పాలకవర్గం నియామకంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పాలకవర్గ సభ్యులు

చైర్‌పర్సన్: బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి

వైస్ చైర్మన్: వడ్డేపల్లి శ్రీరాములు

తిరుమల రాము

కత్తుల కృష్ణయ్య

పిన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి

మర్రి నరసింహ

వడ్డె దామోదర్ రెడ్డి

షేక్ సయ్యద్

గౌని నరేష్

నల్గొండ రాణి లింగస్వామి

పల్లెబోయిన లింగయ్య

దేవిరెడ్డి లక్ష్మారెడ్డి

చిట్టిపోలు నాగయ్య

గుండె రమేష్ బాబు

తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్

జిల్లా మార్కెటింగ్ అధికారి, నల్గొండ

సహాయ వ్యవసాయ సంచాలకులు, నల్గొండ

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్

పూలను దేవతలుగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే ప్రత్యేకం

బతుకమ్మ వేడుకలతో భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి: కోమటిరెడ్డి లక్ష్మి

చౌటుప్పల్, విజయ కెరటం:



పూలను దేవతలుగా భావించి పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకు ప్రత్యేకమని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి అన్నారు. బతుకమ్మ వేడుకల ద్వారా ఈ తరం పిల్లలకు మన పండుగల గొప్పతనాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో త్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 30 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాడుతూ సందడి చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలంతా ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజించుకోవడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకతను చాటిచెబుతుందన్నారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు.దసరా సెలవుల్లో విద్యార్థినులు తమ గ్రామాలకు వెళ్లి నానమ్మలు, అమ్మమ్మలు చెప్పే విషయాలను తెలుసుకోవాలని, తద్వారా మన పూర్వీకుల ఆచారాలు, సంప్రదాయాల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు.దేవుడిచ్చిన శక్తి ఉన్నంతవరకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సమాజానికి, పేద ప్రజలకు సహాయం చేస్తూనే ఉంటామని కోమటిరెడ్డి లక్ష్మి పునరుద్ఘాటించారు.



విజయ కెరటం
తెలుగు దినపత్రిక

నల్గొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బైరెడ్డి హేమలత

- **18 మందితో నూతన పాలకవర్గం ప్రకటన.. సభ్యులకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు**

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా వడ్డేపల్లి శ్రీరాములు నియమితులయ్యారు. మొత్తం 18 మందితో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవుల ఖరారులో భాగంగా నల్గొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని ఓసీ మహిళల కేటగిరీకి కేటాయించారు. ఈ కమిటీ పదవీకాలం ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుంచి రెండేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

నూతన పాలకవర్గం నియామకంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పాలకవర్గ సభ్యులు

చైర్‌పర్సన్: బైరెడ్డి హేమలత వెంకటరెడ్డి

వైస్ చైర్మన్: వడ్డేపల్లి శ్రీరాములు



తిరుమల రాము

కత్తుల కృష్ణయ్య

పిన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి

మర్రి నరసింహ

వడ్డె దామోదర్ రెడ్డి

షేక్ సయ్యద్

గౌని నరేష్

నల్గొండ రాణి లింగస్వామి

పల్లెబోయిన లింగయ్య

దేవిరెడ్డి లక్ష్మారెడ్డి

చిట్టిపోలు నాగయ్య

గుండె రమేష్ బాబు

తిప్పర్తి పీఏసీఎస్ చైర్మన్

జిల్లా మార్కెటింగ్ అధికారి, నల్గొండ

సహాయ వ్యవసాయ సంచాలకులు, నల్గొండ

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్

రజనీ ‘జైలర్ 2’ నుంచి ‘వన్ నేమ్’ వీడియో సాంగ్ విడుదల.. మేకింగ్ విజువల్స్‌తో ఫ్యాన్స్‌కు ట్రీట్!

సూపర్‌స్టార్ రజినీకాంత్ ‘జైలర్ 2’ నుంచి కొత్త అప్‌డేట్


‘వన్ నేమ్’ పాట పూర్తి వీడియోను విడుదల చేసిన చిత్రబృందం

మేకింగ్ విజువల్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్న సాంగ్

అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానున్న ‘జైలర్ 2’

అనిరుధ్ సంగీతంపై ప్రశంసల వెల్లువ

సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న భారీ చిత్రం ‘జైలర్ 2’ నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటికే లిరికల్ వీడియోతో చార్ట్‌బస్టర్‌గా నిలిచిన ‘వన్ నేమ్’ పాట పూర్తి వీడియోను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. సినిమా విడుదలకు సరిగ్గా వారం రోజుల ముందు ఈ మాస్ సాంగ్ వీడియోను రిలీజ్ చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది.ఈ వీడియోలో పాట చిత్రీకరణకు సంబంధించిన మేకింగ్ దృశ్యాలను కూడా జతచేయడం విశేషం. రజినీకాంత్ స్టైలిష్ లుక్స్, సెట్స్‌లో ఆయన హుషారు, సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్టూడియోలో పనిచేస్తున్న విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. గత నెల సెప్టెంబర్ 29న విడుదలైన ‘వన్ నేమ్’ లిరికల్ సాంగ్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రజినీకాంత్ పాత్రను ఎలివేట్ చేస్తూ సాగే ఈ పాటకు అనిరుధ్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు వీడియో రూపంలోనూ ఈ పాట అంచనాలను మించి అలరిస్తోంది.గతేడాది బ్లాక్‌బస్టర్ హిట్టయిన ‘జైలర్’కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజినీకాంత్‌తో పాటు బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, విద్యా బాలన్, ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు, మిర్నా మీనన్ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో నటిస్తోంది. ‘జైలర్ 2’ చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా విడుదలకు ముందు ఈ వీడియో సాంగ్ ప్రమోషన్స్‌కు మరింత ఊపునిస్తుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి.



వరి ధాన్యం కొనుగోలులో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి







నల్గొండ జిల్లాలో 16 మండలాల్లో 77 కొనుగోలు కేంద్రాలు.. గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,461 మద్దతు ధర

నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

వానాకాలం 2026-27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సిబ్బంది నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) అధికారి వై. శేఖర్‌రెడ్డి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.శుక్రవారం నల్గొండలోని టీటీడీసీ జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, పీపీసీ వీవో అధ్యక్షురాళ్లు, వీవోఏలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు విధానాలు, నాణ్యత ప్రమాణాలు, తూకం, రికార్డుల నిర్వహణ, రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై శేఖర్‌రెడ్డి వివరించారు.

77 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఇప్పటివరకు 16 మండలాల్లో 77 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలను ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి, ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే వారి పేర్లను సీరియల్ బుక్‌లో నమోదు చేసి, వరుస సంఖ్య కేటాయించాలని సూచించారు.

గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,461 మద్దతు ధర

ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరల ప్రకారం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 చెల్లించనున్నారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు.రైతులు ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్‌తో శుభ్రం చేసి, తాలు, మట్టి పెడ్డలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఖీూూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, తేమ శాతం 17 శాతంలోపు ఉన్న ధాన్యాన్ని మాత్రమే సేకరించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ధ్రువీకరించిన తర్వాతే ధాన్యాన్ని తూకం వేసి మిల్లులకు పంపించాలని స్పష్టం చేశారు.

తూకంలో పారదర్శకత.. అదనపు వసూళ్లకు తావులేదు

ధాన్యం తూకం వేసే ముందు 20 కిలోల బాటును వెయింగ్ మిషన్‌పై ఉంచి, తూకం ఖచ్చితత్వాన్ని రైతులకు చూపించాలని ఆదేశించారు. ఒక్కో బస్తాలో 40 కిలోల 700 గ్రాముల చొప్పున మాత్రమే తూకం వేయాలన్నారు. హమాలీ చార్జీలుగా క్వింటాల్‌కు రూ.45 మాత్రమే రైతుల నుంచి వసూలు చేయాలని, అదనంగా డబ్బులు లేదా ధాన్యం తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు 150 నుంచి 200 బస్తాల పరిమాణంలో ఉండేలా చూడాలని సూచించారు. గన్నీ బ్యాగులు వచ్చిన వెంటనే లెక్కించుకోవాలని, ధాన్యం కింద పడితే తిరిగి బస్తాల్లో నింపకుండా ట్రక్కులో వేయాలని తెలిపారు. గన్నీ బ్యాగుల నష్టానికి సంబంధించి సంబంధిత మొత్తాన్ని కమిషన్ నుంచి మినహాయించే అవకాశం ఉందని వివరించారు.

రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం వద్దు

ధాన్యం మిల్లులో అన్‌లోడ్ అయిన తర్వాత సంబంధిత సభ్యురాలు మరుసటి రోజు మిల్లుకు వెళ్లి ట్రక్ చిట్ తీసుకురావాలని సూచించారు. ట్రక్ చిట్ అందిన వెంటనే ట్యాబ్ ఆపరేటర్ వివరాలను నమోదు చేసి, మరుసటి రోజు బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు.కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా గ్రామస్థాయిలో పీపీసీ ఇన్‌చార్జి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్ లేదా వ్యవసాయ విస్తరణ అధికారితో కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కమిటీ సభ్యులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, రైతులకు ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూడాలని సంబంధిత డీపీఎంలు, ఏపీఎంలను ఆదేశించారు.పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ ఎం. శ్రవణ్‌కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఏ. మాధవి, కోశాధికారి వై. సునీత, డీపీఎం (నాన్-ఫామ్) పి. వీరయ్య, బాషపాక చంద్రశేఖర్, జిల్లాలోని డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, మార్కెటింగ్ ఎస్‌సీఆర్‌పీలు జానకమ్మ, నాగలక్ష్మి, రేణుక, శాంత, స్వాతి, నిర్మల, దీపిక తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో ‘ది చెన్నై షాపింగ్ మాల్’ ప్రారంభం.. సందడి చేసిన సినీనటి రితిక నాయక్







నల్గొండ, అక్టోబర్ 9 (విజయ కెరటం):

నల్గొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘ది చెన్నై షాపింగ్ మాల్’ను శుక్రవారం సినీనటి రితిక నాయక్ ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్గొండ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజలకు ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణమైన వస్త్రాలు, నాణ్యమైన దుస్తులు ఒకే చోట అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. ప్రారంభోత్సవానికి ప్రత్యేక అతిథిగా హాజరైన రితిక నాయక్ మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి నూతన వస్త్ర శ్రేణులు, ఆకర్షణీయమైన డిజైన్లను పరిశీలించారు. అనంతరం వేదికపై పాటలకు సరదాగా స్టెప్పులు వేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆమెను చూసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు, పట్టణ ప్రజలు పెద్ద

సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా మాల్ నిర్వాహకులు సినీనటి రితిక నాయక్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాల్ నిర్వాహకులు మర్రి వెంకటరెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, మర్రి నరేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ యమ కవిత దయాకర్, యమ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528